
# సింగిల్ పేజీ కథలు

## మా ఇంటికి పోతా!



రాగేశ్వరీదేవికి హృదయం రగిలిపోతున్నది. కోట్ల ఆస్తి ఉంది. ఎదుటివారిని కట్టిపడేసే అందమూ ఉంది. ఒక్కగానొక్క కూతురు ఊటీలో చదువుతున్నది. ఉన్న వ్యాపారాలు చాలక కొత్త వ్యాపారాల గురించి ఆలోచిస్తూ ఇరవై నాలుగ్గంటలూ బిజీగా ఉండే భర్త అఖిలేష్‌కు బ్రహ్మాండమైన పేరు ప్రఖ్యాతులున్నాయి. ఇన్ని ఉన్నా రాగేశ్వరీదేవి రగిలిపోవడానికి పెద్ద కారణం అంటూ లేదు. చిన్న విషయమే. అదీ ఫాల్స్ ప్రిస్టేజ్.

మహిళామండలిలో ఆ రోజు ఉదయం ఓ చిన్న కార్యక్రమం జరిగింది. తన ప్రత్యర్థి డాక్టర్ సురేఖ ఓ ఇద్దరు అనాథ పిల్లల్ని క్లబ్బు సమావేశానికి తీసుకు వచ్చి, గత రెండు సంవత్సరాల నుండీ ఆ నిరుపేద పిల్లల్ని తాను చదివిస్తున్నట్లుగా ప్రకటించి ఆరోజు క్లబ్బు కార్యక్రమంలో భాగంగా ఆ పిల్లలకు బట్టలు బహూకరించింది. ఆ పిల్లలిద్దరూ డాక్టర్ సురేఖను ఓ దేవతలా చూస్తూ పాదాలకు నమస్కరించారు.

మహిళామండలి గౌరవ సభ్యురాళ్లందరూ ఒకరిమీద ఒకరు పోటీ పడుతూ డాక్టర్ సురేఖను పొగడ్తలతో ఆకాశానికి ఎత్తేశారు. అప్పుడు హుందాగా, గర్వంగా ఆమె రాగేశ్వరీదేవి వైపు చూసిన చూపు హృదయాన్ని రగిలించి వేసింది.

రాగేశ్వరి ఆలోచిస్తూ కారు డ్రైవ్ చేస్తున్నది. 'తానూ ఏదో ఒకటి చెయ్యాలి. లేకపోతే క్లబ్బులో తనని సపోర్టు చేసే మెంబర్స్ దృష్టిలో కూడా తాను చులకనైపోతుంది. ఛ... అంతకంటే అవమానకరమైన విషయం మరొకటి లేదు. రాగేశ్వరి కారు గాంధీ పార్కు దగ్గర ఆగిపోయింది.

అందుక్కారణం పార్కు గేటు ముందు నిలుచుని వచ్చీపోయేవాళ్లకు వేరుశెనగకాయలు అమ్ముతున్న పన్నెండేళ్ల పిల్ల ఆమె దృష్టిని ఆకర్షించింది. రాగేశ్వరి చకచకా ఆ పిల్ల దగ్గరికెళ్లి బేరం పెట్టింది. వేరుశెనగకాయల్ని కాదు, పిల్ల జీవితాన్ని. పిల్ల తన ముసలి తండ్రికి చెప్పాలంది. వెంటనే ఆ పిల్లను తీసుకుని గుడిసెలో కూర్చుని గంజాయి తాగుతున్న ముసలి తండ్రిని ఒప్పించి ఐదు వేల రూపాయలకు పిల్లను కొనుక్కుంది.

ఆ పిల్లకు తానుగా 'గంగ' అని పేరు పెట్టింది. మంచి బట్టలు కొన్నది. మంచి భోజనం పెట్టించింది. పనిపిల్ల గంగకు అంతా కలలో జరుగుతున్నట్లనిపించింది. అంతా బాగానే ఉంది కానీ రాగేశ్వరిదేవి తన స్నేహితురాళ్లు ఇంటికి వచ్చినప్పుడు, తానా పిల్లను పెంచి చదివించి గొప్పదాన్ని చేస్తానని ప్రకటిస్తుంది. ఆ తర్వాత గంగను అందరి ముందు, తననో మదర్ థెరిస్సాగా, మేధాపాట్కర్‌గా, కరుణామయిగా.. ఇంకా ఇంకా పొగడాలని శిక్షణనిస్తోంది. మొదట్లో గంగ రాగేశ్వరీదేవి చెప్పినట్లే పాఠాలు వల్లెవేసేది.

రాను రానూ అదో మొక్కుబడి కార్యక్రమం అయిపోయింది. పైగా గంగతో ఇంట్లో చిన్న చిన్న పనులు కూడా చేయించుకుంటున్నది. క్లబ్బులో రాగేశ్వరి 'గంగ' విషయంలో చేస్తున్న సహాయం వల్ల ఆమె పలుకుబడి నాలుగురెట్లు పెరిగిపోయింది. తోటి సభ్యురాళ్లు అభినందనలతో ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. రాబోయే మహిళామండలి ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా తప్పకుండా గెలిచి తీరుతుందని హామీ ఇస్తున్నారు.

రాగేశ్వరీదేవిలో ఈగో తృప్తి పడింది. ఓ సమాజం వారు రాగేశ్వరీదేవికి 'ఉమెన్ ఆఫ్ ది ఇయర్' అవార్డు కూడా ప్రకటించి ప్రధానోత్సవ సభ గ్రాండ్‌గా ఏర్పాటు చేశారు.

గంగ పరిస్థితి పూర్తిగా దిగజారింది. తన లక్ష్యం నెరవేరటంతో రాగేశ్వరీదేవి ఆ పిల్లను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. గత రెండు రోజులుగా జ్వరం. పట్టించుకున్న వారే లేరు. గుడిసెలో అయ్యను చూడాలనిపిస్తోంది. స్వేచ్ఛగా హాయిగా ఉండే జీవితం ఒక్కసారిగా ఊబిలో దిగబడిపోయినట్లనిపిస్తున్నది.

రాగేశ్వరీదేవికి 'ఉమెన్ ఆఫ్ ది ఇయర్' అవార్డు సభకు ఊరిలోని ప్రముఖులందరూ వచ్చారు. ఎం.పీ.గారి చేతుల మీదుగా అవార్డు అందుకున్నది రాగేశ్వరిదేవి. ఆ తర్వాత రాగేశ్వరీదేవి పెంచుకుంటున్న అనాథ బాలికను స్టేజ్ మీదకు తీసుకువచ్చి మాట్లాడమన్నారు. గంగకు ఆ మాటల మీద విరక్తి కలిగింది.

"నాకు ఆనందం లేదు. స్వేచ్ఛ లేదు. ఈవిడ చేసిన సహాయం నాకు అక్కరలేదు. ఇలా ఎల్లకాలం నేను పొగడలేను. నేను మా ఇంటికి పోతా.. మా అయ్యను చూడాలి.. నేను హాయిగా పల్లీలమ్ముకొని బతుకుతా.. మీ అందరికీ దండం..." అని చెప్పి స్టేజీ దూకి పరుగుపెట్టింది.

రాగేశ్వరీదేవి ఊహించని ఈ పరిణామానికి కళ్లు తిరిగి పడిపోయింది. ప్రముఖులతో పాటు అందరూ పగలబడి నవ్వుతుండగా, ఆ సభ రసాభాస అయింది.

**-పి.వి.రమణకుమార్**
(చిలకలూరిపేట)

## వ్యక్తిత్వం

అవినాష్ అంటే ఎందుకో నాకు సదభిప్రాయం లేదు. అలాగని అతడి వలన నాకు మంచిగానీ, చెడుగానీ ఏదీ జరగలేదు. మరి అతడంటే నాకెందుకు అలాంటి అభిప్రాయం కలిగిందో నాకే తెలియదు.

రాహుల్ నాకు చిన్ననాటి స్నేహితులు. ఈమధ్యనే అతడికి ఓ పెద్ద కంపెనీలో ఉద్యోగం వచ్చింది. అదే కంపెనీలో అవినాష్ చాలా కాలంగా పనిచేస్తున్నాడు. వారిద్దరి మధ్యా స్నేహం ఏర్పడింది. రాహుల్ ద్వారానే నాకు అవినాష్ ఫ్రెండ్ అయ్యాడు. బహుశా అవినాష్ కలిశాక రాహుల్ నాతో తక్కువగా కలవటం వలననే అతడంటే నాకు వ్యతిరేకభావం ఏర్పడిందనుకుంటా.

అవినాష్‌తో స్నేహం ఏర్పడ్డాక రాహుల్ నాతో తక్కువగా కలుస్తూ, ఆ తక్కువ సమయంలో కూడా కొత్త మిత్రుడి గురించిన కబుర్లే చెప్పేవాడు. "నీకు తెలుసా? అవినాష్ వాకింగ్ ఎన్‌సైక్లోపీడియా లాంటివాడు. మనకు ఏ డౌట్ వచ్చినా అతడు తప్పకుండా క్లారిఫై చేయగలడు... శంకర్!... ఏదేమైనా అలాంటివాడు మన ఫ్రెండ్ కావటం అదృష్టంరా..."

ఇలాంటి మాటలు వింటుంటే, నాకు చాలా ఇబ్బందిగా అనిపించేది. అవినాష్ మీద క్రమంగా నాలో ద్వేషం పెరగటమూ నాకే అర్థమవుతోంది.

అలాంటి పరిస్థితిలో ఒకరోజు రాహుల్‌ని కలిసి కాసేపు కబుర్లు చెప్పుకున్నాక, ఇంటికి తిరిగొస్తూ ఉన్నాను. రోడ్ క్రాస్ చేస్తుంటే వేగంగా వస్తున్న మోటార్

సైకిల్ నన్ను తాకింది. నేను ఎగిరి అవతల పడ్డాను.

స్పృహ వచ్చేసరికి హాస్పిటల్ బెడ్ మీద ఉన్నట్టుగా నాకర్థమయ్యింది. అప్పుడే మెల్లగా తలతిప్పి అటుచూసిన నేను అలాంటి స్థితిలోనూ షాక్ ఫీలయ్యాను. నా బెడ్‌కి పక్కనే కుర్చీలో కూర్చుని కునుకుపాట్లు పడుతున్నాడు అవినాష్. అతనిని, అక్కడ, ఇలాంటి సమయంలో చూడటం నాకు నమ్మశక్యంగా అనిపించలేదు.

అప్పుడే మెలకువలోకొచ్చిన అవినాష్ నన్ను చూసి నవ్వాడు. "హమ్మయ్యా! స్పృహలోకి వచ్చేశావా?!... ఇప్పటివరకూ మీ మమ్మీడాడీలు ఇక్కడే ఉన్నారు. పెద్దవాళ్లు... వాళ్లను ఇబ్బందిపెట్టడం ఇష్టంలేక, రెస్ట్ తీసుకోమని ఇంటికి పంపించాను."

నాతో ఆ మాటలు చెప్పాక సెల్‌ఫోన్‌లో అమ్మానాన్నలతో మాట్లాడాడు. వాళ్లు హాస్పిటల్‌కి పరుగెత్తుకుంటూ వచ్చారు. ఏడుస్తున్న వారిద్దరికీ అవినాష్ ధైర్యం చెప్పడం చూశాను.

మరో రెండురోజులు అవినాష్ ఎక్కువ సమయం నాతోనే ఉన్నాడు. నా చిన్ననాటి మిత్రుడు రాహుల్ గెస్ట్‌లా అప్పుడప్పుడు వచ్చిపోవడమూ చూశాను.

పెద్ద దెబ్బలు కాకపోవటంతో మూడో రోజు హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ చేసేశారు. ఇంటికి వెళ్లబోతూ ఆగి, అవినాష్‌ని అడిగాను. "ఈ మూడు రోజులు కుటుంబ సభ్యుల కన్నా ఎక్కువగా నాకు సేవ చేశావ్. నేను నీకు మిత్రుడిని కూడా కాదు, మిత్రుడికి మిత్రుడిని. మరి..."

నేనేం అడగదలచుకున్నానో తనకు అర్థమైనట్టుంది. అవినాష్ నవ్వాడు. "అందరి కోసం మనం జీవితం మొత్తం వెచ్చించలేకపోవచ్చు. కానీ మన సర్కిల్‌లో మన బంధువుల్లో, మిత్రుల్లో, మిత్రులకు మిత్రుల్లో కష్టాల్లో ఉంటే మానవతా దృక్పథంతో కాస్త సాయపడడం మనిషి ధర్మం. అదే నేను చేసింది. దట్సాల్..." అన్నాడు సింపుల్‌గా.

నా గుండె అనీజీగా కదిలింది. "కొందరి వ్యక్తిత్వాల గురించి, మరికొందరు వ్యక్తుల గురించి మనకు పూర్తిగా తెలిసి ఉండదు. కానీ వ్యక్తిత్వాల మీద, వ్యక్తుల మీద వెంటనే ఓ అభిప్రాయం ఏర్పర్చేసుకుంటాం. ఒకవేళ మన అభిప్రాయం తప్పని తెలిస్తే, కాస్త ఇబ్బందిపడతాం. అదే మనం ద్వేషిస్తున్న వ్యక్తులే, మనకు సహాయపడితే... ఇదిగో నేను ఫీలయినట్టే... సిగ్గుపడడం, బాధపడడం ఓ నిజం..." మనసులోనే అనుకున్నాను.

అవినాష్‌ని ఆప్యాయంగా కౌగిలించుకుని కృతజ్ఞతలు చెప్పాను.

**-జె.సునీల్‌బాబు**

# ఆంటీ

రాధకి ఓ పెద్ద సమస్య వచ్చిపడింది. ఎదురింటి పెంకుటింటి వాళ్లమ్మాయి 'ఆంటీ' అని పిలవడం మొదలుపెట్టింది. రెండురోజులు భరించింది. మూడవ రోజు అలా పిలవద్దని మృదువుగా చెప్పింది. కొత్తగా పెళ్లయిన తనకు, ఫైనల్ డిగ్రీ చదువుతున్న ఆ అమ్మాయికి వయసులో పెద్దగా తేడాలేదని ఉదాహరణలతో చూపించింది. అయినా ఆ అమ్మాయి వినలేదు. 'ఆంటీ' అనే పిలుస్తున్నది. ఇక భరించలేకపోయింది.

"ఇల్లు మారిపోదాం" భర్తతో ఓ సాయంకాలం అంది.


"అదేం?" ఆశ్చర్యంగా అడిగాడు మురళి. సమస్య చెప్పింది రాధ. చిన్నగా నవ్వాడు మురళి.

"నువ్వు వాళ్లమ్మని ఆంటీ అని పిలుస్తున్నావా?"

"అదేం ప్రశ్న?"

"ఏమీలేదు. ఆ అమ్మకి ఆంటీ అని పిలిపించుకోవడం ఇష్టం లేక ఈ అమ్మాయి చేత ఆంటీ అని పిలిపిస్తుందేమోనని.."

"గొప్ప లాజిక్కే" నవ్వేస్తూ అంది రాధ. "నేనేమీ



ఆమెను ఆంటీ అని పిలవటం లేదు. అలా పిలవటం కూడా నాకిష్టముండదు."

"పోనీ ఆ అమ్మాయి తన వయస్సును మరికొద్దిగా తగ్గించుకోవటానికి ఇదొక ప్రయత్నమేమో"

ఉరిమి చూసింది రాధ.

"ఆ! ఏమీలేదు. మీ ఆడవాళ్లు తమ వయస్సుని తగ్గించుకుంటూ పక్కవాళ్లకి కలుపుతూ ఉంటారు గదా! ఆ అమ్మాయి అలా చేస్తుందేమోనని..."

"అంతమాత్రాన నన్ను ఆంటీ అనేయ్యటమేనా?" ఉక్రోషంగా అంది రాధ. "బయటకి వెళ్తేచాలు, ఆంటీ ఆంటీ అంటూ జీడిలా పట్టుకుంటుంది." "ఇంత సౌకర్యం గల ఇల్లు వదులుకోవటం నాకిష్టం లేదు."

"వెతకండి. నేనీ మానసిక క్షోభ తట్టుకోలేను. నేను ఆంటీనేమిటి?"

"ఆంటీ అని పిలిపించుకునే వయస్సు నీకెప్పుడు వస్తుందంటావ్?"

"ఇంకో నలభై యాభై ఏళ్లకి" నవ్వేసింది రాధ.

★ ★ ★

ఇంటి వేట మొదలుపెట్టక తప్పలేదు మురళికి. సున్నితంగా చెబుతూ ఉంటే ఆ అమ్మాయి వినిపించుకోవడం లేదు. పైగా టీజింగ్ చేస్తున్నట్లుగా పదే పదే ఆంటీ అనటం మొదలుపెట్టింది. తగాదాపడితే పరువు పోతుందేమోనని భయం. సెంటర్‌కి దగ్గరగా ఉన్న ఆ ఇల్లు ఖాళీ చేయటం అసలు ఇష్టం లేదు మురళికి. అతడిని రక్షించటానికే అన్నట్లు టెన్త్ పరీక్షలు రాసి రేవతి వచ్చింది.

"సమయానికి వచ్చావ్" ఎగిరి గంతేస్తూ అన్నాడు మురళి.

"ఏమిటి బాబాయ్" అడిగింది రేవతి.

ఎదురింట్లో ఉన్న తల్లీకూతుళ్లను చూపెడుతూ అన్నాడు. "ఆ అమ్మాయిని ఆంటీ అని, ఆ పెద్దావిడని మామ్మగారు అంటూ పిలువు. మిగతా కథ దానంతట అదే నడుస్తుంది."

అంతే... ఒక్కసారిగా పరిస్థితులు మారిపోయాయి. రేవతిని చూడగానే వాళ్లిద్దరూ లోపలకి పరుగెత్తడం మొదలుపెట్టారు. ఆ అమ్మాయి అయితే దెబ్బలాడేసింది. రేవతిగానీ, రాధగానీ ఏమీ మాట్లాడలేదు. ఆ అమ్మాయి ఆవేశాన్నంతా భరించారు. మళ్లీ మామూలే... తల్లీకూతుళ్లు బయటకు రావటం మానేశారు. ఇరవై రోజులలోనే చిక్కి సగమయ్యారు. అయినా రేవతి వదలిపెట్టలేదు. మామ్మగారూ, ఆంటీ అంటూ వాళ్లింట్లోకి వెళ్లి కాసేపు కూర్చుని రావటం మొదలుపెట్టింది. ఇంటర్మీడియెట్ తనిక్కడే చదువుతానంటూ వాళ్ల గుండెల్లో బాంబు పెట్టి పేల్చింది. అంతే... మరో వారానికల్లా వాళ్లు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయారు.

రేవతి కూడా రిజల్ట్స్ రాగానే వాళ్ల ఊరు వెళ్లిపోయింది. మరో పది సంవత్సరాల తర్వాత ఓ రాత్రి రేవతి మురళికి ఫోన్ చేసింది.

"బాబాయ్! నాకు ఆంటీ సమస్య ఎదురయింది. నీ చిన్నారి కూతుర్ని పంపించు."

**-శ్రీగోపాల్ (సరిపల్లి)**